

# అమెరి "కలగూరగంప" కామెడి

## వంగూరి చిట్టెన్‌రాజు



### మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు

13

మళ్ళీనా? అంది మా క్వీన్ విక్టోరియా. నేను జవాబు చెప్పేలోపుగానే మళ్ళీ "మళ్ళీనా" అంది ఆవిడ.

ఓహో, ఇలాంటి మళ్ళీనా అనే మాట మళ్ళీ ఎన్నిసార్లు అంటుందో అన్నీ అయ్యాకే మాట్లాడుదాం అనుకుని మాట్లడలేదు నేను.

"ఏం, మాట్లాడ వేం?" అని గదమాయించింది ఆవిడ కిచెన్ లోంచే.

ఇక్కడ గమనించవలసినది ఏమిటంటే, ఆవిడ ఒకే మాట రెండు సార్లు అంటే, ఆ రెండిటికీ వేరే కారణాలు ఉంటాయి. అలాగే మూడు సార్లు అంటే మూడు వేరే కారణాలు ఉంటాయనమాట. ఇప్పుడు నుడివిన మొదటి "మళ్ళీనా?"కి ఆవిడ అడగదల్చుకున్న ప్రశ్న ఏమిటంటే "మళ్ళీ ఇంకో సాహితీ సదస్సా? ఇంకా బుద్ధి రాలేదా?" అని అర్థం. రెండో "మళ్ళీనా" కి అర్థం "మళ్ళీ సాహితీ సదస్సు టాపిక్ మీదే రాస్తున్నావా? జనం బోరు కొట్టి చస్తున్నారు" ఇంకా మళ్ళీ మరో మళ్ళీనా అని ఆవిడ అడగదు అని రూఢి చేసుకుని "మొదటి దానికి "అవును" అనీ, రెండో దానికి "నన్ను చంపకుండా ఉంటే చాలుగా" అనీ సమాధానం చెప్పాను.

"సరే, వెర్రి కుదిరింది, రోకలి తలకి చుట్టమన్నాట్ట నీ బోటీ గాడే రేపటి నుంచీ మనిద్దరికీ బాంక్‌లో ఉన్న జాయింట్ అకౌంట్ మూసెయ్. నా దారి నాదే, నీ దారి నీదే? నువ్వు చేసే వెర్రి పనులు నేను ఫైనాన్స్ చెయ్యను గాక చెయ్యను" అని ఆవిడ కొరివి కారం సీసా మూత తీసింది.

ఇంతకీ విషయం ఏమిటంటే, రాబోయే మార్చి 10-11, 2012 తారీకులలో మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు మా హ్యూస్టన్‌లో జరుగుతోంది. నాకు ఎప్పుడూ నేను ఏం చేసిన ఏ కార్యక్రమమైనా అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది గానూ, ప్రపంచంలోనో మరొకచోటో మొట్ట మొట్టమొదటి సారిగానూ, ఇంకా ఇలాంటి భారీ పబ్లిసిటీ చేసుకునేవి గానే ఉంటాయి అని నా అభిప్రాయం. అలాగే ఈ అంతర్జాతీయ సదస్సు కూడా ఉంటుంది అని వేరే చెప్పక్కర లేదు కదా!

అసలు ఇదే సదస్సు కిందటేడు లండన్‌లో చేద్దామనుకున్నాం. "ఆఫ్టరాల్, మహా అయితే పదిహేనుమంది వస్తారేమో కదా! సరే, దానికేం, నువ్వు అమెరికా వాడివి కదా, మీ పెరట్లో చెట్టుని ఘాటిగా దులిపి ఒక పది వేల పౌండ్లు మా బేంక్‌లో ముందు వెయ్యి అప్పుడు చూద్దాం" అన్నారు అక్కడి ధనవంతులు. అదే గదా అచ్చ తెలుగు సాంప్రదాయం. ముందు పక్కవాడి ఇంట్లో పండే

కూరగాయల్ని లాగేసుకుని, వండేసుకుని, తినేసి, ఆ తరవాత ఇంకా ఆకలి వేస్తే మన పెరట్లో వాటిని కోసుకుంటాం.

విడాకులు తీసుకోవడంలో మొదటి స్టెప్పు అభిప్రాయ బేధాలు అని ఎక్కడో చదివాను. కానీ విడాకులకి ఈ సాహితీ సదస్సు కంటే మంచి కారణాలు ఉంటే బావుంటుంది కదా. అంతే కాక ఆవిడ బావుంటుందనీ, మంచి ఆవిడ అనీ అందరూ అంటారు కదా! ఎటునుంచి ఎటు చూసినా జడ్జీగారు జనం కూడా, ఈ విడాకులకి నువ్వే కారణం అంటారు కదా! అంచేత నేను ఎందుకైనా మంచిదని మా జాయింట్ అకౌంట్‌లోంచి ఆవిడ వాటా తీసేసి, నా వాటాలో ఎంత తక్కువ డబ్బుందో చూసుకుని సంతోషించాను. హమ్మయ్య, ఇక పరవాలేదు, సదస్సుకు కావసిన పాతిక వేల డాలర్లు విరాళాల ద్వారా పోగెయ్యవచ్చును అనుకుని విజృంభించాను. సొంత డబ్బుతో చేస్తే సొంతసేవ, సంఘం డబ్బుతో చేస్తే సంఘసేవ అని ఇది వరకు నేను ఏదో సభలో చెప్పిన మాట గుర్తుకొచ్చి, నా మాట నిలబెట్టుకోవాలనుకున్నాను. అంతే కాక, ఎంత ఎక్కువ డబ్బు ఖర్చు పెడితే అంత ఎక్కువ సేవ చేసినట్టు కదా! నా అదృష్టం బావుండి అందరి స్పందనా భలేగా ఉంది. ముఖ్యంగా అమెరికాలో కొత్తగా వెలిసిన నాటా సంస్థ వారు చాలా సాహిత్య సేవ చేద్దామని ఆవేశపడి ఈ సదస్సుకి మంచి సహాయం అందజేస్తున్నారు.

ఇక, ప్రపంచ సదస్సు అన్నాం కదా, కనీసం రెండు దేశాల నుంచి..అంటే అమెరికా కొంత మందీ, కెనడా నుంచి ఒక్కళ్ళూ వస్తే చాలుగా అన్నాను మా తొలి కమిటీ మీటింగులో. అందరూ వికటాట్టహాసం చేసి, "మీరు చీప్ అని తెలుసు కానీ మరీ ఇంత కక్కుర్తా?" అని కమిటీ ఒకాయన చేత చెప్పించారు. మొత్తానికి ఏమైతేనేం ఇండియా నుంచి పదిమందీ, బ్రిటన్ నుంచి ముగ్గురూ, మధ్యప్రాచ్య దేశాలనుంచి ముగ్గురూ, కెనడా నుంచి ముగ్గురూ ఆహ్వానిత అతినిధులుగా లెక్క తేలారు. అలాగే అమెరికాలో సాహిత్య కృషి చేస్తున్న వారిని కూడా ఆహ్వానించాం. అందులో మన కౌముది సంపాదకులు, సహ సంపాదకులు ప్రముఖులు. విదేశ ఆహ్వానితులలో వీసా ఎంతమందికి ఉందో, ఘనత వహించిన హైదరాబాదులో ఉన్న అమెరికా కాన్సలేట్ వారు ఎంత మందికి వీసా ఇస్తారో తెలియదు.

"ఎన్ని సార్లు చెప్పాలీ?" అంది క్వీన్ విక్టోరియా. నేను నోరు మెదిపే లోపుగా మళ్ళీ "ఎన్ని సార్లు చెప్పాలీ" రెట్టించింది మా ఆవిడ. ఇందులో మొదటి ప్రశ్నకి నా దగ్గర సమాధానం రెడీగా ఉంది.

"ఓ అదా, జాయింట్ అకౌంట్ మూసే అంత సీన్ లేదులే. విడాకుల పత్రం బైట పారెయ్. సదస్సుకు కావల్సిన డబ్బంతా సంపాదించేశాను" అన్నాను గర్వంగా.

"గుడ్ బోయ్" అంటూ ఆవిడ అప్పుడెప్పుడో తీసేసిన కొరివికారం సీసా మూత పెట్టేసింది. కానీ నా జన్మలో మొట్టమొదటిసారిగా ఆవిడ రెండో ప్రశ్న ఏమిటో నా బుర్రకి తట్ట లేదు. ధైర్యం చేసి అడిగేశాను ఇందాకా ఇంకేమిటో, అదేమిటీ అని.

"ఓ అదా, నీ సదస్సుకి ఇండియా నుంచి ఎవరైనా సాహిత్యం వాళ్ళు వస్తుంటే మన ఇంట్లో ఉండమను, పాపం, వాళ్ళు హోటల్‌లో ఉండలేరు. నానా అవస్థా పడతారు, నీ గురించి బాగానే అనుకుంటున్నారుగా ఆంధ్ర ప్రదేశ్‌లో, అందుకూ" అంది మా క్వీన్ విక్టోరియా. నాకు ఒక క్షణం మతి పోయింది. వెంటనే రెండో క్షణం కూడా మతి పోయింది.

ఇందులో మొదటి క్షణం మతిపోవుటకు కారణం సాక్షాత్తూ మా ఆవిడ ఇండియా అతిథులని మా ఇంటికి ఆహ్వానించడం. నేను ఇదివరలో అనేక మంది ఇంట్లో పెట్టుకోవడం, ఆవిడ నానా ఇబ్బందీ పడడం నాకు అనుభవమే!

నా గురించి ఇండియా వాళ్ళు బాగానే అనుకుంటూన్నారు అని ఆవిడకి ఎలా తెలిసిందా అని నాకు తెలియకపోవడం రెండో క్షణం మతిపోవడానికి కారణం. "ఓ అదా, నీ గురించి గవర్నమెంట్ వారి ఆంధ్రప్రదేశ్ పత్రికలోనూ, నవ్య వార పత్రికలోనూ బాగానే రాశారుగా, వాళ్ళే రాశారో, నువ్వే రాయించుకున్నావో నాకు తెలియదనుకో, బట్, నీ డబ్బా నువ్వే కొట్టుకోకుండా, పై వాళ్ళు వాయించారుగా..ఇట్ ఈజ్ ఆల్ రైట్..." అంది క్వీన్ విక్టోరియా. నా గురించిన ఆ రెండు వ్యాసాలూ ఆ మహా తల్లి ఎప్పుడు చదివిందో నాకు తెలియదు. కావాలంటే మీరు కూడా ఈ క్రింది లింకులు చూడండి.

http://www.andhrapradeshpatrika.com/issues/2012/jan/page18.asp
http://www.navyaweekly.com/2012/jan/25/page18.asp

నవ్యలో వ్యాసం చదివి మా ఆవిడ స్నేహితురాలు "అమ్మలూ, కవర్ పేజీ మీదే అమ్మాయి బొమ్మ పక్కనే మీ ఆయన పేరు వేశారు. ఆ అమ్మాయి అందంగా ఉంది కదా అని అక్కడే ఆగి పోతాడేమో మీ ఆయన, లోపల తన మీద ఉన్న వ్యాసం కూడా చదవమను" అంటూ ఇచ్చిన ఈ -మెయిల్ కబురు ద్వారా మా ఆవిడకి ఈ పై విషయాలు తెలిశాయి.

అన్నట్టు, ఈ హడావుడిలో పడి, అసలు సంగతి..అంటే వచ్చే నెల మార్చి 10-11, 2012 లో జరిగే మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు మా హ్యూస్టన్ రావడం మర్చిపోకండి. ఎందుకంటే, ఆ సదస్సు అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగానూ, భారతదేశం ఎల్లలు దాటి కేవలం సాహిత్యానికి మాత్రమే పెద్ద పీట వేస్తున్న మొట్ట మొట్టమొదటి అంతర్జాతీయ సమావేశం కదా! అందుకూ.

●●●

Click here to share your comments on this article